
విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న అల్వాల్ పోలీసులు

పది పరీక్షలు ప్రారంభం

– మొదటి రోజు 12,626 మంది హాజరు

సుభాష్‌నగర్: పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ఉండగా విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకున్నారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల కోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 53 సెంటర్లను ఏర్పాటు చేయగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 12,672 మంది ఉన్నారు. ఇందులో 46 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 12,626 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షలు రాశారు. విద్యార్థుల వెంట తల్లిదండ్రులు వచ్చారు.

- శంభీపూర్ ప్రాంతానికి చెందిన శివం అనే విద్యార్థికి సూరారంలోని నార్త్ హై సిటీలో సెంటర్ పడింది. 22 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. బైక్ రిపేర్ వల్ల ఆలస్యమైందని పరీక్ష కేంద్రానికి అనుమతించాలని కోరగా పోలీసులు సమయం మించిపోయిందని వెనక్కి పంపించారు.

పోలీసుల బందోబస్తు

కుత్బుల్లాపూర్: పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కోసం ట్రాఫిక్ పోలీసులకు తవ వంతు కృషి చేశారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ.నాగరాజు ఆధ్వర్యంలో 15 పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలుపుతూ సిబ్బంది తమ చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని విద్యార్థుల్లో మనోధైర్యం కల్పించారు.


పరీక్షకు అనుమతించాలని పోలీసులను వేడుకుంటున్న ఆలస్యంగా వచ్చిన విద్యార్థి


సూరారంలోని పరీక్ష కేంద్రం వద్ద సీఐ భరత్‌కుమార్


పరీక్ష కేంద్రం బయట విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యార్థుల సమస్యలు పట్టని ప్రభుత్వం



కుత్బుల్లాపూర్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వైష్ణవి, మేడ్చల్ జిల్లా కన్వీనర్ నాగేష్ అన్నారు. శుక్రవారం బాచుపల్లి శాఖ చైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించలేదని విమర్శించారు. పాఠశాలలు, యూనివర్సిటీల్లో సమ్యలు రాజ్యమేలుతున్నాయని, సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి



జీడిమెట్ల: అనారోగ్యంతో ఓ యాచకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ సాగర్ వివరాల ప్రకారం.. మార్చి 6న షాపూర్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద గోపాల్(45) అనే యాచకుడు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గమనించిన శ్రీధర్ అనే వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 19వ తేదీన రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి సంబంధీకులు ఎవరైనా ఉంటే జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తిని కొనసాగించాలి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించడమే మల్లు స్వరాజ్యంకు ఘనమైన నివాళి అని సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకట్రామయ్య అన్నారు. శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతిని ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైజాం పాలన అంతం కోసం, భూమి, భుక్తి, విముక్తి కోసం ఆనాడు సాయుధ పోరాట కదనరంగంలో దూకిన వీరనారి మల్లు స్వరాజ్యం అని అన్నారు. స్వరాజ్యం స్ఫూర్తితో మహిళలందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, ఎన్.బాలపీరు, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై రిజిస్ట్రార్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిజాంపేట్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్, జిల్లా కమిటీ సభ్యుడు నందేశ్వర్ మాట్లాడుతూ.. ఇక్కడ పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఎస్ఎఫ్ఐ నాయకులు లీల, సాయి తదితరులు పాల్గొన్నారు.

బోర్లల్లో నీరు రాక తిప్పలు


బట్టలు ఉతుకుతున్న మహిళలు

- కుంటల్లో బట్టలు ఉతుక్కుంటున్న డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు
- బోర్లకు మరమ్మతులు చేయాలని వేడుకోలు

దుండిగల్: 'అద్దె ఇంట్లో ఉండే తమకు డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చాయని, సొంత ఇళ్లల్లో దర్జాగా బతకొచ్చని ఎన్నో ఆశలతో ఇక్కడికి వచ్చాం.. కానీ వాడుకోవడానికి నీళ్లు లేక చెరువుల్లో బట్టలు ఉతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిటీలో ఉన్న మమ్మల్ని ఇక్కడికి దూరంగా తీసుకువచ్చి వదిలేశారు.. బోర్లు పని చేయకపోవడంతో కనీసం వాడుకోడానికి కూడా నీళ్లు లేక అవస్థలు పడుతున్నాము' అంటూ మహిళలు బోరు మంటున్నారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద గత బీఆర్ఎస్ ప్రభుత్వం లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి అందజేసింది. ఇక్కడ మొత్తం 37 బ్లాకులు ఉండగా ఒక్కో బ్లాక్‌లో 108 చొప్పున 3,996 ఫ్లాట్లు ఉన్నాయి. ఇందులో 20 శాతం కుటుంబాలు నివాసముంటున్నాయి. కాగా ఆయా బ్లాకుల్లో ఏర్పాటు చేసిన బోర్లల్లో నీరు రాకపోవడంతో ప్రజలు ఇలా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో ఉన్న చెరువు, కుంటల్లో బట్టలు ఉతుక్కుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక అసోసియేషన్ సభ్యులు స్పందించి బోర్లకు మరమ్మతులు చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై స్పెషల్ ఫోకస్

పన్ను చెల్లించని ఇళ్ల డ్రైనేజీలు బ్లాక్ చేసిన సిబ్బంది

నిజాంపేట్: ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడుతుండటంతో మున్సిపల్ అధికారులు ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టారు. లక్ష్య సాధనకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు కాలనీలు, బస్తీలలో ఇంటి పన్ను చెల్లించని వారి ఇంటి నుంచి వచ్చే మురుగు నీరు డ్రైనేజీలో కలవకుండా మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీని బ్లాక్ చేశారు. ఇంటి పన్ను చెల్లించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించని వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. బకాయి ఉన్న యజమానులు త్వరగా ఇంటి పన్ను చెల్లించి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ కోరారు.


మురుగు నీరు డ్రైనేజీలో కలవకుండా బ్లాక్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తు చేసుకోండి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువత 'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21–55 ఏళ్ల మధ్యనున్న అభ్యర్థులు ఉపాధి హామీ పథకానికి, 21–60 ఏళ్లు కలిగి ఉన్న అభ్యర్థులు భూసంబంధ, ఉద్యానవన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంవత్సర ఆదాయం (గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్ష, పట్టణ/మున్సిపాలిటీ వారికి రూ.2 లక్షలకు మించి ఉండవద్దన్నారు. మీ–సేవ నుంచి పొందిన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగిన దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఏప్రిల్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంతో సహా 040–24020610 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.


అంబేడ్కర్ ఓవర్సీస్ పథకానికి..

ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కింద ఉపకార వేతనాల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

'పది' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ గౌతమ్
- దుండిగల్, శామీర్‌పేట్ సెంటర్ల తనిఖీ

సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సిబ్బందిని ఆదేశించారు. దుండిగల్, శామీర్‌పేట మండలాల్లోని పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా దుండిగల్ మండలంలోని మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఉన్నాయా..? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శామీర్‌పేట మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో దుండిగల్, శామీర్‌పేట్ తహసీల్దార్లు మతీన్, యాదగిరిరెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


పరీక్షా కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పది పరీక్షలకు 99.72 శాతం మంది హాజరు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 230 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కాగా, 99.72 శాతం విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. జిల్లాలో మొత్తం రెగ్యులర్ విద్యార్థులు 47,329 మంది ఉండగా 47,195 మంది హాజరు కాగా 134 మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. అలాగే 140 మంది ప్రైవేట్ విద్యార్థులకు 113 హాజరు కాగా 27 మంది పరీక్షలు రాయలేదని పేర్కొన్నారు. కీసర మండలకేంద్రంలోని ఓ కేంద్రంలో వసతులు సరిగా లేవని ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించామని తెలిపారు. ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా కూడా అందిన ఫిర్యాదులపై ఆమె తక్షణమే స్పందించి సంబంధిత ఎంఈఓ ద్వారా పరిష్కారమయ్యేలా ఆదేశాలిచ్చారు. పరీక్షా పత్రాల తరలింపు తదితర వాటిని డీఈఓ ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.



లైంగికదాడి.. ముగ్గురి రిమాండ్

జగద్గిరిగుట్ట: వ్యభిచారం చేస్తున్న మహిళను మభ్యపెట్టి లైంగికదాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహ కథనం ప్రకారం.. స్నేహితులైన ఇద్దరు మహిళలు కేపీహెచ్‌బీ అడ్డాలో వ్యభిచారం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 19న వీరు ఎల్లమ్మ బండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు ఇందులోని ఓ మహిళతో మాట్లాడి తమతో గడపాలని అడగిన క్రమంలో నిరాకరించింది. బాధిత మహిళ (35)ను మభ్యపెట్టి విటుడు ప్రగతి నగర్ చెరువు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ అతనితో పాటు మరో ఇద్దరు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎల్లమ్మ బండ సిక్కు బస్తీకి చెందిన రవీందర్ సింగ్, గోవింద్ సింగ్, రూప్ సింగ్‌లను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

రేపు ముదిరాజ్ సమరభేరి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజాంపేట్ : ముదిరాజ్ సమరభేరిని జయప్రదం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిరాజ్ సమరభేరికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లమంతా సంఘటితమై హక్కుల సాధన కోసం పోరాడాలని సూచించారు. ఆదివారం గచ్చిబౌలిలోని ఎస్.వి.కె. హాల్‌లో ఉదయం 10 గంటలకు జరగబోయే ముదిరాజ్ సమరభేరి సభకు తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ బంధువులు, నాయకులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా ఆలయ 10వ వార్షికోత్సవం



మూసాపేట: మూసాపేటలోని మహంకాళి, సరస్వతి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు ప్రసాద్, సాకేత్‌ల సమక్షంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, కుంకుమార్చనలు, హోమం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

సెల్‌ఫోన్ దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగింత

సుభాష్‌నగర్: సెల్‌ఫోన్ అపహరించి పారిపోతున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన దూలపల్లిలో చోటు చేసుకుంది. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో శుక్రవారం సాయంత్రం జరుగుతున్న సంతలో మేడ్చల్‌కు చెందిన మహేష్ ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్‌ను అపహరించాడు. పారిపోతున్న క్రమంలో గమనించిన స్థానికులు అతడిని పట్టుకొని పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. స్థానికంగా జరుగుతున్న సంతలో ఇటీవల తరచూ సెల్‌ఫోన్లు అపహరణకు గురవుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

నెలల తరబడి ఇక్కడే..



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామికవాడలోని దినాలి ఫుడ్స్ పరిశ్రమ ఎదురుగా ఉన్న రోడ్డు పక్క ఆరు నెలలుగా ఆటో (ఏపీ28 టీసీ 3661) అక్కడే ఉంటుంది. ఎవరైనా దొంగిలించి సదరు ఆటోను వదిలి వెళ్లారా? లేదా రిపేరు రావడంతో అక్కడే ఉంచారా? అన్నది తెలియడం లేదు. ఆటోకు చక్రాలు కూడా లేవు. రోడ్లపై నెలల తరబడి నిలుపుతున్న వాహనాల విషయమై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో సమావేశం


పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సమస్యలను హెచ్‌ఎంటీ పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని మాజీ ఎమ్మెల్యే, యూనియన్ అధ్యక్షుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. హెచ్‌ఎంటీ పరిశ్రమలో శుక్రవారం పరిశ్రమ యాజమాన్యం యూనియన్ సభ్యుల పరిచయ సమావేశం నిర్వహించారు. కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. ఉద్యోగ విరమణ అయిన కార్మికుల బకాయిలపై కూడా చర్చించామని తెలిపారు. సమావేశంలో జీడిమెట్ల హెచ్‌ఎంటీ కంపెనీ జీఎం రాజ బాబు, జేజీఎం షాహిన్, హెచ్‌ఆర్ కార్తీక్, యూనియన్ జనరల్ సెక్రెటరీ జి.శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీశైలం, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కేశవ్, రతన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్ జాయింట్ సెక్రెటరీ నరసింహ చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాం బాబు, ట్రెజరర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సమస్యలపై అధికారులతో చర్చిస్తా

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మార్కెట్ కమిటీ సభ్యులు పలు సమ్యస్యలపై శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యని త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గాదె వినోద్, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, కుత్బుల్లాపూర్ మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలు శుభకార్యాలు, వివిధ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పాల్గొనాలని హన్మంత్‌రెడ్డిని పలువురు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నిజాంపేట మున్సిపాలిటీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొలన్ హన్మంత్‌రెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

- కాలం చెల్లిన పదార్థాలు ధ్వంసం, మరికొన్ని సీజ్
- నోటీసులు జారీ, పరీక్షల కోసం ల్యాబ్స్‌కు తరలింపు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పసుపు, కారం, మసాలాల తయారీ, నిల్వ, విక్రయకేంద్రాలు, పలు రెస్టారెంట్లపై రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్నింటిని సీజ్ చేయటంతో పాటు మరికొన్నింటిని ధ్వంసం చేశారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్, శ్రీషిక, పి.స్వాతి, జగన్నాథ్‌తో కూడిన బృందం మేడ్చల్ జిల్లాలోని కిష్టాపూర్ సర్వే నంబర్ 819 , హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సూర్య మసాలా మరియు స్పైసెస్)లో తనిఖీలు నిర్వహించారు. మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాల్లో పరిశుభ్రత లేకపోవడం, అలాగే మసాలా ఉత్పత్తి ముడి పదార్థాలపై లేబుల్ సమాచారం లేదని తదితర వాటిని గుర్తించారు. నిర్వహణ విభాగంలో సరైన రికార్డులు కూడా లేవని వారు పేర్కొన్నారు. 46.75 క్వింటాళ్ల తయారైన సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం–వెల్లుల్లి పేస్ట్), మసాలా పొడులు కలిగి ఉన్న రూ. 3 .03 లక్షల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపించినట్లు పేర్కొన్నారు. సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నివేదికలో కల్తీ అని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని టాస్క్‌ఫోర్స్ ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా చేసి, విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షిత ఆహారం అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు, సూచనలు జారీ చేశారు. అనుమతుల్లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని టీం హెడ్ వి.జ్యోతిర్మయి హెచ్చరించారు.



ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ 7వ ఫేజ్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను శుక్రవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీ కరుణాకర్ నాయుడు, పుష్పారెడ్డి, నాయకులు సంజీవరావు, మేకల మైకల్, తమ్మినేని ప్రవీణ్‌కుమార్, రేష్మ, సంధ్య, పొన్నం రజిత, బండి సుధా తదితరులు పాల్గొన్నారు.


క్యాంటిన్ ప్రారంభించిన సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, బండి రమేష్ తదితరులు